



ఫోర్జరీ సంతకాలతో విరాసత్‌కు యత్నం

- తహసీల్దార్ కార్యాలయ సిబ్బందే సూత్రధారులు
- విషయం బయటకు పొక్కడంతో అప్రమత్తం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎమ్మార్వో
- దండేపల్లి మండలంలో వెలుగు చూసిన ఘటన

మంచిర్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మరణించిన వారి సంతకాలు ఫోర్జరీ చేసి భూమిని విరాసత్ చేసుకోవాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టిన సంఘటన దండేపల్లి మండలంలో వెలుగు చూసింది. ఈ తతంగం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందే నడిపించగా, విషయం బయటకు పొక్కడంతో అప్రమత్తమైన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉండగా, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కార్యాలయ సిబ్బంది ప్రోత్సాహంతోనే...

దండేపల్లి మండల కేంద్రానికి చెందిన గొర్రె జానీకి 1.18 ఎకరాల భూమి ఉంది. ఆయనకు ఇద్దరు కుమారులు పౌల్, స్వామి ఉన్నారు. జానీ అనారోగ్యం కారణంగా 2012లో మరణించగా, అతని భార్య మరియ గతేడాది సెప్టెంబరులో చనిపోయింది. పెద్ద కుమారుడు పౌల్ 2024 జనవరి 6న అనారోగ్యంతో మరణించాడు. పౌల్ భార్య ఏసుమణికి తెలియకుండా తండ్రి పేరిట ఉన్న భూమిని రెండో కుమారుడు స్వామి విరాసత్ చేసుకునేందుకు ప్రయత్నం చేశాడు. 2023 ఏప్రిల్ 28న మీసేవాలో స్వామి దరఖాస్తు చేసుకున్నాడు. ఒకరి పేరిట ఉన్న భూమిని ఇతరుల పేరిట విరాసత్ చేయాలంటే నిబంధనల మేరకు అంతకు ముందు పట్టా కలిగి ఉన్న వారి స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉంటుంది. జానీ కుటుంబం విషయంలోనూ ఇదే నిబంధన అమలు చేయాల్సి ఉండగా అప్పటికే చనిపోయిన పౌలు, అతని తల్లి మరియ సంతకాలను ఫోర్జరీ చేశారు. ఫోర్జరీ సంతకాలతో కూడిన ఫైల్‌ను 14 నెలల తరువాత 2024 జూన్‌లో తహసీల్దార్‌కు అందజేశారు. దరఖాస్తు అందిన తరువాత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఎంఆర్ఐ) స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన అనంతరం మరణించిన వారి కుటుంబ సభ్యుల సమక్షంలో పంచనామా చేయాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యుల సంతకాలు సేకరించిన అనంతరం సదరు ఫైల్‌ను తహసీల్దార్ లాగిన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే దరఖాస్తుపై ఎవరు సంతకం చేశారో నిర్ధారించకుండానే తహసీల్దార్ లాగిన్‌లో పొందుపర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ తతంగంలో పెద్ద మొత్తంలో చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది.

విరాసత్ కోసం కలెక్టర్ వద్దకు ఫైలు...

ఆర్ఐ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా తహసీల్దార్ సంబంధిత ఫైల్ అప్రోవల్ కోసం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి పంపించారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ లాగిన్‌కు సైతం వెళ్లింది. అనుమానం వచ్చిన కలెక్టర్ కార్యాలయం సిబ్బంది దాన్ని తిరస్కరించారు. ఈ లోగా ఫోర్జరీ సంతకాలతో విరాసత్ కోసం దరఖాస్తు చేశారనే విషయం బయటకు పొక్కడంతో అప్రమత్తమైన తహసీల్దార్ అప్రోవల్ చేసిన ఫైలును రద్దు చేశారు. అనంతరం తహసీల్దార్ ఆర్ఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఆర్ఐ చంద్రమౌళి కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డు విషయంలో తనను తప్పుదారి పట్టించారని పేర్కొంటూ గత నెల 31న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


ఫోర్జరీ సంతకాలతో విరాసత్ కోసం దరఖాస్తు చేసిన దండేపల్లిలోని భూమి

ఆర్ఐకి మెమో జారీ...

విరాసత్ విషయంలో దరఖాస్తుదారుని కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డు చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఆర్ఐ చంద్రమౌళికి తహసీల్దార్ మెమో జారీ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని ఫోన్‌లో వివరణ కోరగా, స్టేట్‌మెంట్ రికార్డు విషయంలో నిర్లక్ష్యం వహించినందునే ఆర్ఐకి సంజాయిషీ ఇవ్వాలని మెమో జారీ చేసినట్లు తెలిపారు.

ఎఫ్ఐఆర్ నమోదుకు వెనుకంజ..?

తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ స్వయంగా ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయడం లేదనే అపవాదు ఉంది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే పోలీసులు కేసు నమోదు చేయడం లేదనే ప్రచారం జరుగుతోంది. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ వివరణ కోరగా ఫిర్యాదు స్పష్టంగా లేకపోవడంతో ఎఫ్ఐఆర్ నమోదులో కొంత ఆలస్యం జరిగిందని, ఫోర్జరీ చేసిన వారిపై వెంటనే కేసు పెడుతున్నట్లు తెలిపారు.

గణనాథుడి పూజకు వేళాయే..

- విభిన్న రూపాల్లో స్వామివారి ప్రతిమలు..
- ఊరు వాడా ఉత్సవాలకు సిద్ధం
- నేడు వినాయక చవితి

నస్పూర్, సెప్టెంబరు 6: గణపతి నవరాత్రోత్సవాలకు సర్వం సిద్ధమైంది. శనివారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా గణపతి ప్రతిమకు భక్తి శ్రద్ధలతో పూజించి అనంతరం నిమజ్జనం చేస్తారు. గణపతి మండళ్లను నిర్వాహకులు రంగురంగుల విద్యుత్ దీపాలతో నిర్వాహకులు ముస్తాబు చేశారు. జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు చవితి శుభ గడియలో ఆయా మండపాల్లో గణపతి విగ్రహాలను నెలకొల్పనున్నారు. విభిన్న రూపాల్లో కొలువు దీరిన గణనాథుడు నవరాత్రులు పూజలందుకోనున్నాడు. నవరాత్రులు భక్తి పాటలు, భజనలు, పూజలు, అన్నదానాలు నవరాత్రుల కోలాహలం కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 650కి పైగా గణేష్ మండళ్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.



వినాయకుడిని ఆరాధించడమంటేనే ప్రకృతిని పూజించడమని భావిస్తారు. పూజలో వినియోగించే మట్టి నుంచి పసుపు, ఆకులు అణువణువునా ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. ప్రకృతిలో లభించే 21 రకాల పత్రిలో ఎన్నో ఔషధగుణాలు ఉన్నాయి. వర్షాకాలంలో లభించే మొక్కలు ఈ సీజన్‌లో వ్యాప్తి చెందే ఆరోగ్య సమస్యలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెబుతారు.

- **మార్కెట్‌లో సందడి:** గణపతి పూజలకు అవసరమైన పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. చిరు వ్యాపారులు గణపతి పూజకు అవసరమైన ఆకులు, మారేడు, నేరుడు కాయలు, తమల పాకులు, ఆరటి పండ్లు తదితర పూజలకు వినియోగించే సామగ్రి కొనుగోళ్ళు జోరుగా సాగుతున్నాయి. పూజా దుకాణాల్లో సామగ్రి కాగితపు పూల దండలు, దారాలు, రిబ్బన్స్, అలంకరణ సామగ్రి అమ్మకాలు జరిగాయి.
- **పెరిగిన పూల ధరలు...:** గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మార్కెట్లో పూల ధరలు విపరీతంగా పెరిగాయి. బంతి పూలు కిలో రూ.120, చామంతి -రూ. 700 నుంచి 800వరకు, మల్లె, సన్నజాజి, గులాబీలు రూ. 150 నుంచి రూ. 250వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. డజను అరటి పండ్లు రూ. 70, జామ రూ. 150, ఆపిల్ రూ. 100 నుంచి 250 వరకు, కొబ్బరికాయలు రూ. 20 నుంచి 22వరకు లభిస్తున్నాయి. ఆంధ్రలో వర్షాలు, వరదల ఫలితంగా పూలపై ధరల ప్రభావం పడినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ, పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

చెన్నూరు, సెప్టెంబరు 6: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం 5వ వార్డు గెర్రె కాలనీలో అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.31 కోట్లతో నిర్మించనున్న వాటర్ ట్యాంకు పనులను ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ వాటర్ ట్యాంకు ద్వారా 2 వేల కుటుంబాలకు నల్లా కనెక్షన్లు ఇచ్చి ఇంటింటికి తాగు నీరందిస్తామన్నారు. ట్యాంకు నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారుకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల్లో నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం ఫెయిల్యూర్ అయ్యిందన్నారు. మిషన్ భగీరథ పథకంలో రూ.40 వేల కోట్లు ఖర్చు చేసి గత ప్రభుత్వం కమీషన్లు దండుకుందన్నారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గానికి ఎక్కువ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సుద్దాల, కమ్మర్‌పల్లి, తుర్కపల్లి గ్రామాల్లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు సమస్యలను వెల్లడించారు. మౌలిక సదుపాయాలతోపాటు అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల ముందే బాహాబాహి

అమృత్ 2.0 పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనుల్లో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొనగా వారి ఎదుటే భీమారం-చెన్నూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బాహాబాహికి దిగారు. భీమారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి రాగా అక్కడ ఉన్న జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ మూలరాజిరెడ్డి భీమారం నాయకులకు ఇక్కడ ఏమి అవసరమని గొడవకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వారితో మాట్లాడడంతో గొడవ సద్దుమణిగింది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

రామకృష్ణాపూర్: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.41.5 కోట్ల నిధులతో తాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. అమ్మ గార్డెన్స్ సమీపంలో నిర్మించే వాటర్ ట్యాంకుకు కలెక్టర్ కుమార్ దీపక్, శాసన సభ్యులు గడ్డం వివేకానంద, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చైర్‌పర్సన్ జంగం కళలతో కలిసి భూమి పూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన పథకాలను లబ్ధిదారులకు అందించే విధంగా అధికార యంత్రాంగంతో కలిసి పని చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎమ్మార్వో సతీష్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కౌన్సిలర్ తిరుపతి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ వంశీకృష్ణకు అవార్డు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6: పెద్దపల్లి నియోజకవర్గ ఎంపీ, విశాఖ ఇండస్ట్రీస్ జేఎండీ గడ్డం వంశీని ప్రతిష్టాత్మక బీడబ్ల్యూ డిస్ రప్ట్ అవార్డు వరించింది. నలభై ఏళ్లలోపు సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా వంశీ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఢిల్లీలోని రాడిసన్ హోటల్‌లో శుక్రవారం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఫోరం ఆఫ్ ఇండియాస్ టాప్ ఫౌండర్స్ పేరుతో బీడబ్ల్యూడిస్‌రప్ట్ 8 ఎడిషన్-2024 అవార్డులను అందించగా, వంశీ తరపున విశాఖ ఢిల్లీ బ్రాంచ్ జనరల్ మేనేజర్ ముకేశ్ సిసోడియా, ఏజీఎం రాజ్ హన్స్ అందుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, సెప్టెంబరు 6: తెలంగాణ మోడల్ కాలేజీలో సివిక్స్ సబ్జెక్టు గంటల ప్రతిపాదికన బోధించేందుకు లెక్చరర్ కావాలని కళాశాల ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌తోపాటు బీఈడీ సోషల్ స్టడీస్ చదివిన వారు ఈనెల 10వ తేదీలోగా కాలేజీలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఐసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 6: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఐసెట్ 2024 కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మొదటి రోజు 275 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. ఈ కౌన్సెలింగ్ ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నారు. ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు విద్యార్థులు ఐసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. అధికారులు దేవేందర్, మధుకర్, రాందాస్,రాజమల్లు, శ్రీనివాస్, నాగరాజు, శివకుమార్, కృష్ణ పాల్గొన్నారు.

స్త్రీశక్తి క్యాంటీన్ నిర్మాణ పనులకు భూమి పూజ

మందమర్రిరూరల్, సెప్టెంబరు 6: మందమర్రిలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎంపీడీవో రాజేశ్వర్ స్త్రీశక్తి క్యాంటీన్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని, జిల్లా వ్యాప్తంగా 5 స్త్రీశక్తి క్యాంటీన్‌ల నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. చెన్నూరు, మందమర్రి, బెల్లంపల్లి, మంచిర్యాల, లక్షెట్టిపేటలలో క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో క్యాంటీన్ నిర్మాణానికి రూ.20 లక్షలను ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. ఈ క్యాంటీన్‌ల ద్వారా పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతారన్నారు.

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

నస్పూర్, సెప్టెంబరు 6: సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధనలో కూడా మార్పులు తీసుకురావాలని, టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురష్కరించుకుని నస్పూర్ ట్రస్మా ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిక చేసిన 30 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి వస్తుందని, ఉపాధ్యాయులు టెక్నాలజీని ఉపయోగించుకుని వృత్తి నైపుణ్యానికి మరింతగా పదును పెట్టాలన్నారు. మండల విద్యాధికారి పోచయ్య మాట్లాడుతూ గురుతర బాధ్యత విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమన్నారు. సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు రాధాసంజీవ్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, గౌరవ అధ్యక్షుడు బత్తిని దేవన్న, నస్పూర్ పట్టణ ట్రస్మా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు సత్యనారాయణ, అంబాల రాజ్ కుమార్, అమన్ ప్రసాద్, కృష్ణారెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రజిని పాల్గొన్నారు.

క్యారమ్ ర్యాంకింగ్ టోర్నమెంట్

బెల్లంపల్లి, సెప్టెంబరు 6 : రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో ఖైరతాబాద్‌లోని ప్రకాశం విద్యానికేతన్ పాఠశాలలో సబ్ జూనియర్, జూనియర్, యూత్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్ జరుగుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి బాలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజన్నలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 12, 14, 18, 21 విభాగాల్లో బాల బాలికలకు పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 12లోగా ఎంట్రీలను పంపాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9440010404లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి అర్పిత మారంరెడ్డి

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 6: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని లక్షెట్టిపేట సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి అన్నారు. శుక్రవారం లక్షెట్టిపేట పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడికొప్పుల కిరణ్, ఏజీపీ వేల్పుల సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను రోజు నిర్వహించాలి


పాఠశాలలో రిజిష్టర్‌లను పరిశీలిస్తున్న డీపీవో

కోటపల్లి, సెప్టెంబరు 6 : గ్రామాల్లో పారిశుధ్య పనులను రోజు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు అన్నారు. శుక్రవారం కొల్లూరు, దేవులవాడ, బబ్బెరచెల్క గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కంపోస్టు షెడ్ పరిధిలో ఒక గుంతను తీసి అందులో కంపోస్టు జరిగేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా బయోలార్వా, ఫాగింగ్ చేయాలని, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. పారిశుధ్య పనులకు సంబంధించిన రిజిష్టర్‌లను అప్‌డేట్ చేయాలన్నారు. దేవులవాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేయడంతో అభినందించారు. పాఠశాల రిజిష్టర్‌లను తనిఖీ చేసి సమయపాలన పాటించాలని సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జైపూర్ : ఇండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కుందారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రావ్య పేర్కొన్నారు. శుక్రవారం ఇందారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏఎన్ఎం కృష్ణవేణి, కార్యదర్శిసుమన్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 6: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జి వద్ద శుక్రవారం గుర్తు తెలియని రైలు ఢీకొని చున్నంబట్టివాడకు చెందిన తన్నీరు రవి (37) మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ సుధాకర్, రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. రవి రాజీవ్ నగర్ నుంచి మంచిర్యాలకు వెళ్లే మార్గంలో రైలు పట్టాల పై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

నస్పూర్, సెప్టెంబరు 6 : జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా గల సాయి రెసిడెన్సీ లాడ్జిపై శుక్రవారం దాడి చేసి వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని పట్టుకున్నట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. సుంకరి శివయ్య, మందాల శివ అశిష్, గోస్కుల ప్రశాంత్, ఆకుల ప్రశాంత్, రౌతు కార్తీక్, తిరుపతిలు లాడ్జిలో మహిళలతో పట్టుబడ్డారన్నారు. వీరిని విచారించగా లాడ్జిలో రెండు గంటలు పాటు మహిళలతో రూమ్స్‌లో ఉండడానికి రూ. 1100 చెల్లించేందుకు లాడ్జి మేనేజ్‌మెంట్‌తో మాట్లాడుకున్నారన్నారు. దీంతో లాడ్జి యాజమాన్యం ఒప్పుకుని అనుమతి ఇచ్చిందన్నారు. లాడ్జి యాజమాన్యం డబ్బులు తీసుకుని వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. దీంతో లాడ్జి మేనేజర్ మోటం జనార్దన్‌తో పాటు ఆరుగురు విటులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. రూ.6600 నగదు సీజ్ చేసి ఏడుగురితోపాటు లాడ్జి ఓనర్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు.

బీసీలను ఎదగకుండా అణిచివేస్తున్నారు



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 6: జనాభా నిష్పత్తి ప్రకారం 60శాతం ఉన్న బీసీలను అన్ని రంగాల్లో ఎదగకుండా అణిచివేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రనాయకుడు నీల కంటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇందు గార్డెన్ వద్ద ఆయన మాట్లాడుతూ రాజ్యాధి కారంతోనే బీసీల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. పది శాతంలేని అగ్రకులాలు అధికారం చెలాయిస్తూ మెజార్టీ ఉన్న బీసీలను అణగ దొక్కుతున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికలకు ముందు కులగణన చేపట్టాలన్నారు. బీసీలను సంఘటితం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, ఇందుకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కుల గణన చేపట్టాలని ఈనెల 25న ఛలో బీసీకార్య క్రమం చేపట్టామని, హైదరాబాద్‌లో బీసీల నినాదాన్ని చాటుతామన్నారు. శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

సంఘం పట్టణ అధ్యక్షుడిగా శంకర్

జాతీయ బీసీ సంక్షేమసంఘం మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా సకినాల శంకర్ ఎన్నికయ్యారు. సాయి మిత్ర గార్డెన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో రాయబారపు కిరణ్, శంకర్‌లు పోటీపడ్డారు. కిరణ్‌కు 11ఓట్లు, శంకర్‌కు 36ఓట్లు పోలయ్యాయి. దీంతో ఎన్నికల అధికారి శంకర్‌కు నియామక పత్రాన్ని అందించారు.

పెద్ద ఎత్తున వరద సహాయం ప్రకటించాలి

మందమర్రి టౌన్, సెప్టెంబరు 6 : భారీ వర్షాలకు వరద బీభత్సం సృష్టించిందని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు దెబ్బతిన్నాయని పెద్దపల్లి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో కోలుకోని విధంగా నష్టపోయిందని పేర్కొన్నారు. తెలంగాణకు తక్షణ సాయం 5 వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు. చంద్రబాబునాయుడు విజయవాడలో మోకాళ్ల లోతు నీళ్లలో నడుస్తూ అందరికి ఆహార పొట్లాలను పంపిణీ చేశాడని పేర్కొన్నారు వాసాల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రామకృష్ణాపూర్, సెప్టెంబరు 6 : రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిదిలోని బొక్కలగుట్ట జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెం దారు. ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

భీమిని, సెప్టెంబరు 6: పుస్తక పఠనంతో ఒత్తిడి తగ్గి మానసిక ఆరోగ్యాన్ని పెంచుతుం దని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి అన్నారు. శుక్రవారం రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుస్తక పఠన ప్రాముఖ్యతపై అవగాహన కల్పిం చారు. రూమ్ టు రీడ్ ఎల్ఎఫ్ సుచరిత, సీఆర్పీలు వెంకటేష్, ఎంఐఎస్ శ్రీధర్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సంచార గ్రంథాలయం వాహనం పర్య టించింది. రీడింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా పుస్తకాలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్‌లు రమేష్, జయకృష్ణ, సీఆర్పీ నారాయణ, కానిస్టేబుల్ లక్ష్మణ్, గ్రామస్తులు డాగయ్య, బిక్షపతి పాల్గొన్నారు.

వివాదాస్పదంగా దుబ్బపల్లి గ్రామసభ

జైపూర్, సెప్టెంబరు 6 :రామారావుపేట గ్రామంలోని దుబ్బపల్లిలో శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ వివాదస్పదంగా మారింది. శ్రీరాంపూర్ ఓసీపీ విస్తరణలో భాగంగా కొన్ని నివాస గృహాలు ముంపునకు గురవుతున్నాయి. నిర్వాసితుల జాబితాలో అక్రమాలు జరిగాయని కొన్ని వివాదాలు కోర్టు వరకు చేరాయి. గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ గోవింద్, ఆర్ఐ తిరుపతి, సింగరేణి అధికారులు పాల్గొన్నారు. ఒక రోజు ముందు సమాచారం నిర్వహిస్తున్నారని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. ఉదయం కార్యదర్శికి సమాచారం ఇచ్చి సాయంత్రం ఏర్పాటు చేయడం వెనక మతలబు ఏమిటని ప్రశించారు.

స్టెరిలైజేషన్ సెంటర్ కోసం స్థల పరిశీలన

బెల్లంపల్లి, సెప్టెంబరు 6 : బెల్లంపల్లిలో కుక్కల వ్యాప్తిని అరికట్టడానికి స్టెరిలైజేషన్ ప్రాసెస్ (సంతానోత్పత్తి జరగకుండా చర్యలు) సెంటర్ కోసం ఎల్లందు గెస్ట్‌హౌజ్ వద్ద శుక్రవారం స్థలాన్ని పరిశీలించినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించామన్నారు. కౌన్సిలర్ షేక్ అస్మాయూసుఫ్, ఆర్వో ప్రవీణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

లక్సెట్టిపేటరూరల్, సెప్టెంబరు 6 : ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణాధ్యక్షుడు తొగరు రాజు కోరారు. శుక్రవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాదులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పురుషోత్తం, లింగన్న, రవీందర్, రమేష్, సత్తయ్య పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

దండేపల్లి, సెప్టెంబరు 6: కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని ఆదివాసి మహిళపై అత్యాచారయత్నం, దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ళ రాజమల్లు, అంబెద్కర్ సంఘం మండల అధ్యక్షుడు లింగంపల్లి బాపులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ సంధ్యరాణికి వినతిపత్రాన్ని సమర్పించారు. బచ్చల అంజన్న, రాజన్న, దయాకర్, శ్రీనివాస్, సుభాష్, సాయికుమార్, వసంత్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి(తాండూర్): అత్యాచారయత్నం, దాడి చేసిన నిందితున్ని ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ నాయకులు ఎస్ఐ, ఆర్ఐలకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ రెండు రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు రవీందర్, సంతోష్, మణికుమార్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కాసిపేట, సెప్టెంబరు 6 : బెల్లంపల్లిలోని రాంజీగోండు విద్యా లయంలో శుక్రవారం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ అధికారులు నిత్యావసర సరుకులు అందించారు. హెచ్ఆర్ జీఎం కులకర్ణి మాట్లాడుతూ అంతర్జాతీయ చారిటీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సరుకులు అందిస్తున్నామన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు పోషకాహారం అవసరం

కాసిపేట, సెప్టెంబరు 6: పిల్లల ఎదుగుదలకు పోషకాహారం అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. పోషణమాసంలో భాగంగా శుక్రవారం రేగులగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడు తూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ నిర్మల, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

అంజన్న హుండీల ఆదాయం రూ.81లక్షలు

మల్యాల, సెప్టెంబరు 6: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంకు హుండీల ద్వారా రూ.81,07,641 నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో ఎం.రామకృష్ణ రావు తెలిపారు. 56 రోజులకు గాను ఆలయంలోని 12 అంజన్న హుండీలనువిప్పి శుక్రవారం లెక్కించగా నగదుతోపాటు 14గ్రాముల మిశ్రమబంగారం, 4.900 కిలోల మిశ్రమ వెండి, 61విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈలెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, ఏఈవో వైఅంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్ ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీ వేంకట అన్నమాచర్య సేవాట్రస్ట్‌సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

ఆగని దేశీదార్ దందా

● సరిహద్దు గుండా దిగుమతి
● స్థానిక లిక్కర్ అమ్మకాలపై ప్రభావం



కాగజ్‌నగర్, సెప్టెంబరు 6: మహారాష్ట్రకు సరిహద్దునే ఉన్న జిల్లాలోని చాలా గ్రామాల్లో ప్రస్తుతం మహారాష్ట్ర దేశీమద్యం ఏరులై పారుతోంది. వివిధ రకాల పేర్లతో దేశీదార్ ధర తక్కువగా ఉండటం అధిక మత్తు ఇస్తుండటంతో దీనిపై మందుబాబులు మొగ్గు చూపుతున్నారు. ఇక్కడి మద్యం ధరలు కూడా అధి కంగా ఉండటం పరోక్షంగా మహారాష్ట్ర నుంచి దేశీదార్ స్మగ్లింగ్‌కు ఊతమిస్తోం దన్న అంచనాలున్నాయి. ఏడాది క్రితం వరకు మహారాష్ట్రలో ఇక్కడి వ్యాపారులు ఆడిందే ఆటగా అమ్మిందే మందుగా సాగింది. గడ్చిరోలి చంద్రపూర్ జిల్లాలో మహారాష్ట్ర జిల్లాలో పాక్షిక మద్యనిషేధాన్ని అమలు చేయటంతో గడిచిన ఐదేళ్ల అక్కడ మందుబాబులకు మద్యం అందుబా టులో లేకుండాపోయింది. ఈ క్రమంలో మహా రాష్ట్రకు పొరుగునే ఉన్న ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి, వాంకిడి, సిర్పూరు, కౌటాల, చింతల మానేపల్లి, బెజ్జూరు, మద్యం దుకాణాల నుంచి భారీ ఎత్తున ఐఎంఎల్ మద్యం మహారాష్ట్రకు స్మగ్లింగ్ జరిగేది. దాంతో ఈసరిహద్దు దుకాణాలకు టెండర్లలో కోట్లాది రూపాయలు ధర పలికింది. తాజాగా మహారాష్ట్ర ప్రభుత్వం చంద్రపూర్ జిల్లాలో మద్య నిషేదాన్ని ఎత్తివేసింది. అక్కడ దేశీదారు చవకధరకు దొరుకుతోంది. దీంతో జిల్లాలోని మందుబాబులు దేశీదారు వైపు మొగ్గుచూపారు. ఇదే అదునుగా మహారాష్ట్ర నుంచి దేశీదారు గుట్టుచప్పుడు కాకుండా దిగుమతిఅవుతోంది. దీంతో జిల్లాలోని సరిహద్దు మద్యం దుకాణాల్లో విక్రయాలులేక ఆర్థికంగా కుదేలయ్యేపరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో కొంతకాలంగా జిల్లాఎక్సైజ్ యంత్రాంగం దేశీదార్‌పై దృష్టి సారించి స్మగ్లింగ్‌జరుగుతున్న మార్గాలపై గట్టి నిఘాపెట్టింది. అయినప్పటికీ స్మగ్లర్లు ఎక్సైజ్‌యంత్రాంగాన్ని బురిడీకొట్టించి మరీ జిల్లాలోకి దేశీదారును స్మగ్లింగ్ చేస్తున్నట్టు కనిపెట్టారు. దేశీదారు స్మగ్లింగ్, గుడుంబా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతూ భారీగా జరిమానాలు విధిస్తున్నారు. ఇటీవల కొన్నికేసుల్లో ఒక్కొక్కరిపై లక్ష రూపాయలవరకు జరిమానా విధించారు. అయినప్పటికీ దేశీదారు దొంగ రవాణా మాత్రం ఆగడం లేదు.

దేశీదారు నియంత్రణకు దాడులు చేస్తున్నాం..

- రవికుమార్, ఎక్సైజ్ సీఐ, కాగజ్‌నగర్

మహారాష్ట్రలో మద్య నిషేదం ఎత్తివేసినందున అక్కడినుంచి దేశీదారు అక్రమ మార్గాల గుండా జిల్లాలోకి దిగుమతి అవుతోంది. మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి మద్యం ప్రవేశించకుండా నిఘాపెడుతున్నాం. ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నాం.

మట్టి గణపతులను పూజించాలి : కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 6: మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో మాట్లాడారు. మట్టి వినాయకులను పూజించి నిమజ్జనం చేయడం ద్వారా చెరువులు, జలాశయాలు కలుషితం కావన్నారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనంతో నీరు, నేల కలుషితం అవుతుందన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారి నాగేశ్వర్ రావు, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, డీఆర్‌డీవో కిషన్, అధికారుల సంఘం అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, యోగేశ్వర్ పాల్గొన్నారు. గుండేటి యోగేశ్వర్ బంకమట్టితో తయారు చేసిన విగ్రహాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

బెల్లంపల్లి: పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజించాలని ఆర్డీవో హరికృష్ణ, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్యలు పేర్కొన్నారు. పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని సూచించారు. సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్, సభ్యులు పాల్గొన్నారు.

కాసిపేట: మట్టి గణపతులను పూజించాలని దేవాపూర్ డీఏవీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం సిమెంట్ కంపెనీ మెయిన్ గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ రసాయనాలతో తయారు చేసే విగ్రహాలను నీటిలో వేసినప్పుడు జలచరాలు మృతిచెందే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలందరు మట్టి గణపతులను పూజించాలన్నారు.

భీమారం: జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. ప్రధానోపాధ్యాయుడు విక్రమ్ మాట్లాడుతూ మట్టి గణపతులను పూజించాలన్నారు.

నస్పూర్: పాత మంచిర్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేశారు. మట్టి విగ్రహాలను పూజించాలని ఉపాధ్యాయురాలు మంజుల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు మాళవిదేవి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి గణపతుల పంపిణీ

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ ఐబీ చౌరస్తాలో అభినవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంజనిపుత్ర ఎస్టేట్స్ సహకారంతో ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్ఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మట్టి గణపతులను పూజించి పర్యావరణానికి మేలు చేయాలని కోరారు. ఆర్ఐ అంజన్‌కుమార్, ఏపీవో నందన్‌కుమార్, ఈసీ సత్యనారాయణ, సల్పాజీ మహేందర్‌రావు, రవీందర్, రామన్న, శేషగిరి, చంద్రశేఖర్, కృష్ణదేవరాయలు, అభినవ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: పర్యావరణ పరిరక్షణనకు మట్టి గణపతులను పూజించాలని జీఎం దేవేందర్ తెలిపారు. సీఆర్ క్లబ్‌లో సింగరేణి యాజమాన్యం సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. రంగులతో కూడిన విగ్రహాలను నిమజ్జనం చేయడం ద్వారా నీరు కలుషితం అవుతుందన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్, అధికారులు, దేవాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీరాంపూర్: మట్టి గణపతి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సేవా అధ్యక్షురాలు రాధాకుమారి అన్నారు. మట్టి విత్తన వినాయక విగ్రహాలను సేవాభవన్‌లో అందజేశారు. డీజీఎం (పర్సనల్) పి. అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, పర్యావరణ అధికారి హన్మాన్ గౌడ్, సీనియర్ పీవో కాంతారావు, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి, సభ్యులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఎస్ ఓ టు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, శ్రీధర్, పాల్గొన్నారు.

గణపతి దీక్షలు ప్రారంభం

నస్పూర్ :నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మి గణపతి ఆలయంలో శుక్రవారం పలువురు భక్తులు 11 రోజుల గణపతి దీక్ష స్వీకరించారని ఆలయ ప్రధానార్చకులు గంగరపు వంశీకృష్ణ శర్మ తెలిపారు. నియమాలతో దీక్షను కొనసాగించాలన్నారు.

కాసిపేట: ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గణపతి ఉత్సవాలను మంచిర్యాల లయన్స్‌క్లబ్, సఖి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షురాలు బండ శాంకరి ఉపాధ్యాయులు పుష్పలత, కృష్ణగోపాల్, మాధవీలత, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

చెన్నూరు: గణపతి ఉత్సవాలను, నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. సంతోషి మాత ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. మండపాల వద్ద ఎలాంటి గొడవలకు తావివ్వకూడదన్నారు. చెరువు కట్ట వద్ద ఉన్న ఘాట్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐలు రవీందర్, సుధాకర్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, విద్యుత్ ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

జైపూర్: ప్రశాంత వాతావరణంలో గణపతి పండగను జరుపుకోవాలని సీఐ మోహన్ పేర్కొన్నారు. పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

వేమనపల్లి: పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ సూచించారు. మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. పోలీసులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

శ్రీరాంపూర్: గణేష్ మండపాల నిర్వాహకులు మండపం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. వారికి వచ్చిన క్యూ ఆర్ కోడ్‌ను ప్రింట్ తీసి లామినేషన్ చేసుకోవాలని సూచించారు. పోలీసులకు క్యూ ఆర్ కోడ్‌ను చూపించాలని పేర్కొన్నారు.

భీమిని: గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై విజయ్ కుమార్ సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ బికర్ణ దాస్, ఏఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరిగేలా అధికారులు కృషి చేయాలని ఆర్డీవో హరికృష్ణ అన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాలను రోజు పరిశీలించాలని సూచించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

జైపూర్, సెప్టెంబరు 6: హెచ్‌ఐవీపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని దిశ ప్రోగ్రాం అధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గంగిపెల్లి పల్లె దవాఖానాలో హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షల క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉచితంగా హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. హెచ్‌ఐవీ అనేది అంటువ్యాధి కాదని, సురక్షితం కాని లైంగిక చర్యలకు పాల్పడితే వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. పల్లె దవాఖానా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేదశ్రీ, సిబ్బంది రాజేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

చెన్నూరు, సెప్టెంబరు 6: అధిక వర్షాలకు గురైన పత్తిలో సమయానుసారంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం అధికారి డాక్టర్ కోట శివప్రసాద్ సూచించారు. శుక్రవారం కిష్టంపేట, అక్కెపల్లి గ్రామాల్లో పత్తి పంటలను జిల్లా వ్యవసాయాధికారి కల్పనతో కలిసి పరిశీలించారు. పత్తిలో గులాబీ రంగు పురుగు, రసం పీల్చే పురుగులు, కాయకుల్లు తెగులు వంటి సమస్యలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యవసాయాధికారులను సంప్రదించి మందులను పిచికారీ చేయాలన్నారు. ఏడీఏ ప్రసాద్, శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్, ఏఈవోలు రాజు, రాజశేఖర్, రైతులు ఉన్నారు.

ఎంపీ పరామర్శ

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 6 : లక్షెట్టిపేట పట్టణానికి చెందిన అగ్గు పోశవ్వ అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కుటుంబ సభ్యులను శుక్రవారం పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిలు పరామర్శించారు. మృతురాలు అల్లుడు మందమర్రికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సదానందం సుపరిచితుడు కావడంతో గోదావరి రోడ్డులోని కుటుంబీకులతో మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఉన్నారు. పట్టణంలో మాలల కోసం ప్రత్యేకంగా కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మాలమహానాడు నాయకులు వినతి పత్రం అందించారు. రవీందర్, శాంతికుమార్, రాజు,చిన్నయ్య, రవి పాల్గొన్నారు.

నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రోగ్రాం చైర్మన్, తదితరులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 6: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్లను శుక్రవారం ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రరెడ్డిలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశామన్నారు. వైద్యులు చంద్రబాను,యశ్వంత్, శిల్ప, బీష్మ, శ్రీధర్, శంకర్ పాల్గొన్నారు.

మంచిర్యాల-అంతర్గాం వంతెనను త్వరగా పూర్తి చేయాలి

నస్పూర్, సెప్టెంబరు 6 : గోదావరి నదిపై రూ. 164 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన మంచిర్యాల-అంతర్గాం వంతెనను త్వరగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాలలోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖను విడుదల చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వంతెనను మరో చోట నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేస్తున్నారని, దీని వలన రూ.450 కోట్ల ఖర్చుతో పాటు 8 కిలోమీటర్ల మేరకు భూ సేకరణ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు సౌకర్యం, ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా పాత స్థలంలోనే నిర్మాణం చేయాలన్నారు. నడిపెల్లి విజిత్ కుమార్, సత్యం, నరేష్, తాజుద్దీన్, మొగిలి శ్రీనివాస్, సర్ణలతశ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

● మండపాలను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు ● నేడు వినాయక చవితి


ఆసిఫాబాద్‌లో ముస్తాబవుతున్న వినాయక మండపం


వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు


మార్కెట్లో డెకరేషన్ సామగ్రి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 6: జిల్లాలో వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం నుంచి జిల్లా వ్యాప్తంగా తొమ్మిదిరోజుల పాటు వినాయకచవితి ఉత్సవాలను జరుపుకోనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు వినాయక మండపాలను సిద్ధంచేశారు. జిల్లాకేంద్రంతో పాటు జిల్లాలోని 14మండలాల్లో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. మండపాలను అన్నిహంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే వినాయక విగ్రహాలను పలు ప్రాంతాల నుంచి మండపాలకు చేరవేశారు. ఒకరికంటేఒకరు భారీ విగ్రహాలు నెలకొల్పేందుకు ప్రత్యేక ఏర్పాట్లను చేపడుతున్నారు. పలు మండపాల నిర్వాహకులు లక్కీడ్రా ద్వారా కార్లు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, ఎల్‌ఈడీ టీవీలు తదితర ఆకర్షణీయమైన బహుమతులతో లక్కీడ్రాలను చేపడుతున్నారు. చవితి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ఆయా మండపాల వద్ద బందోబస్తు చేపట్టనున్నారు. నవరాత్రులు పూజలం దుకున్న అనంతరం వినాయక నిమజ్జనాన్ని చేపట్టనున్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

వాంకిడి, సెప్టెంబరు 6: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని అదనపుకలెక్టర్ దాసరి వేణు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వాంకిడి తహసీల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగలను మతాలకు అతీతంగా శాంతియుత వాతవరణంలో జరుపుకోవాలన్నారు. వినాయకచవతి, మిలాద్‌ఉన్‌నబీ పండుగలను మతసామరస్యంతో శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. పండుగల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతికమిటీలు కృషిచేయాలన్నారు. వినాయక మండపాలకు తప్పనిసరిగా అధికారుల అనుమ తులు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనంలో డీజేలకు అనుమతులులేవని ఎవరైనా పెడితేచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జైనూరులో జరిగిన ఘటననేపథ్యంలో ప్రజలు సంయమనం పాటించాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రకటనలు పోస్టుచేస్తే చట్టపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. వదంతులను ఎవరూ నమ్మవద్దని అన్ని వర్గాల వారు సంయమనంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్‌అలీ, గిర్దావార్ మాజీద్ పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న హిందూ ఉత్సవ సమితి నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 6: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, హిందూ ఉత్సవాల్లో కుల మతాలకు, రాజకీయ పార్టీలకతీతంగా పాల్గొని హిందూ ఉత్సవ కమిటి అధ్యక్షుడు దీపేశ్ రేన్వ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఖండేల్‌వాల్ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక మండపాల నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో నియమాలు పాటించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. పోలీసుల సూచనలు పాటించాలన్నారు. నాయకులు రవీందర్, సురేష్ బల్దువ, సత్యం, తిరుపతి, హరికృష్ణ, మున్నా రాజాసిసోడియా, హరికృష్ణ, రవీందర్, జగన్, ఆంజనేయులు, సతీష్ పాల్గొన్నారు.

వరాహ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజల్లో పాల్గొన్న పలువురు

హాజీపూర్, సెప్టెంబరు 6 : గుడిపేటలోని గోవిందక్షేత్రంలోని భూనీల సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వరాహ జయంతి సందర్భంగా శుక్రవారం అష్టోత్తర శత కళశ అభిషేకం, సామూహిక అష్టోత్తర శతనామావళి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో గుడిపేట 13వ బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు దంపతులు, ఆలయ నిర్మాణ దాత బిల్లా మల్లయ్య దంపతులు, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయప్రధాన అర్చకులు నరసింహ స్వామి, ప్రమోద్‌స్వామిలు పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: సీడీపీవో


అవగాహన కల్పిస్తున్న సీడీపీవో తిరుపతమ్మ

రెబ్బెన, సెప్టెంబరు 6: పౌష్టికాహారంతోనే ఆరోగ్యకమైన జీవితాన్ని గడపవచ్చని ఆసిఫాబాద్ ఇన్‌చార్జీ సీడీపీవో తిరుపతమ్మ అన్నారు. పోషణమాసం సందర్భంగా శుక్రవారం మండలంలోని గోలేటిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార అవగాహణ సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు, కిషోర బాలికలు, పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ మనం ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పోషకవిలువలతో కూడిన ఆహారపదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకు కూరలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, పప్పులు ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న బాలామృతాన్ని చిన్నపిల్లలకు క్రమంతప్పకుండా తినిపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, సుశీల, స్వర్ణలత, మంజుల, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి "వాక్-ఇన్-అడ్మిషన్స్"

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6 : ఐటిఐలో ప్రవేశానికి నాలుగో విడతలో భాగంగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ కమిషనర్ ఉత్త ర్వులు జారీచేసినట్లు శ్రీరాంపూర్ ఐటిఐ ప్రిన్సిపాల్ టి. సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. మూడు విడతల్లో భర్తీ చేయగా మిగిలినసీట్లను "వాక్-ఇన్-అడ్మిషన్స్" ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాసైన ఆసక్తి గల విద్యార్థులు www.iti.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో రూ.100 వెరిఫికేషన్ ఫీజు చెల్లించి ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు సమర్పించాలన్నారు. ఆన్‌లైన్ ప్రింటెడ్ కాపీ, ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు "వాక్-ఇన్-అడ్మిషన్స్" హాజరు కావాలని కోరారు. గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని, ఇప్పటికే సీట్లు కేటాయించిన వారికి "వాక్-ఇన్-అడ్మిషన్స్"లో అవకాశం లేదని ప్రిన్సిపాల్ వివరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

దండేపల్లి,సెప్టెంబరు 6: మండలం మ్యాదరిపేట పంచాయతీ పరిధిలోని మదాపూర్ గ్రామశివారులోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న వారిని శుక్రవారం దాడులు చేసి పట్టుకున్నట్లు దండేపల్లి ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు. మదాపూర్‌లో ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా ఐదుగురిని అదుపులో తీసుకోని వారివద్ద నుంచి 1800 రుపాయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై వెల్లడించారు.

నేటి నుంచి ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరణ

ఆసిఫాబాద్, సెప్టెంబరు 6: శనివారం ఉదయం నుంచి జిల్లాలోని తొమ్మిది మండలాల్లో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించనున్నట్లు జిల్లా అధికార వర్గాలు వెల్లడించాయి. జైనూరుతోపాటు లింగాపూర్, తిర్యాణి, సిర్పూర్(యు), కెరమెరి, వాంకిడి మండలాల్లో ఇంటర్నెట్ సేవలు ఉండవని, మిగితా మండలాల్లో మాత్రమే ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

దండేపల్లి, సెప్టెంబరు 6: ఉపాధ్యాయ వృతికి మించినది మరొకటి లేదని లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందర్ అన్నారు. ధర్మరావు పేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బోగు శ్రీనివాస్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందు కున్న సందర్భంగా శుక్రవారం ఆయనను సన్మానించారు. అంగన్‌వాడి టీచర్ ప్రసన్నకుమారి, పంచాయతీ కార్యదర్శి సనంద, వివిధ శాఖల సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

జన్కాపూర్ కాంప్లెక్స్ పరిధిలో..

కన్నెపల్లి: జన్కాపూర్ కాంప్లెక్స్ పరిధిలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు రాము శుక్రవారం సన్మానించారు. ఉపాధ్యాయులు పాత శాలకు రెండు ఫ్యాన్‌లు, గడియారం అందించారు. శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

రెండవ రోజు బంద్ సంపూర్ణం


వాంకిడిలో రెండవ రోజు మూసి ఉన్న దుకాణాలు

వాంకిడి, సెప్టెంబరు 6: జైనూరులో గిరిజన మహిళపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రెండవ రోజు నిర్వహించిన బంద్ సంపూర్ణంగా జరిగింది. ఉదయం 11నుంచి ఆదివాసీ నాయ కులు బంద్ పాటించాలని పిలుపు ఇవ్వడంతో వ్యాపారస్తులు కిరాణా దుకాణాలను, పాన్‌షాపులను, హోటళ్లను, ఇతర వ్యాపారసంస్థలను మూసివేశారు. వరుసగా రెండు రోజులు బంద్ చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శనివారం వినాయకచవితి పండుగ ఉండడంతో నిత్యావసర సరకుల కోసం ఇతర గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు కిరాణా, ఇతరదుకాణాలు మూసి ఉండడంతో ఇబ్బందులకు గురయ్యారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంటర్‌నెట్ లేక ఇబ్బందులు..

జిల్లాలో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. దీంతో బ్యాంకుల్లో లావాదేవీలు నిలిచిపోయాయి.ఆన్‌లైన్‌సెంటర్‌లు, మీసేవకేంద్రాలు పనిచేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


మూసి ఉన్న మీసేవా కేంద్రం

ఈఎస్ఐ ఆసుపత్రి కూల్చివేతకు గ్రీన్‌సిగ్నల్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 6: కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి భవనం కూల్చివేసేందుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ప్రస్తుతం కొనసాగుతున్న భవనంలో ఈఎస్ఐ, డిస్పెన్సరీ సేవలు అందిస్తుండగా, వీటిని ఖాళీచేయాలని కార్పొరేషన్ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరటంతో పదిహేను రోజులుగా వర్షాలకు భవనం పెచ్చులూడుతోంది. 2022లో ఈ భవనం నిర్వహణ యోగ్యం కాదని వెంటనే ఖాళీ చేయాలని నిట్ ఇంజనీర్ల బృందం తేల్చిచెప్పింది. ఈ భవనంలోని సామగ్రిని కాగజ్‌నగర్‌లో ప్రభుత్వ కార్యాలయాల్లోకి మార్చి సేవలు అందించాలని ఈఎస్ఐ రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు పంపించారు. అయితే ఇప్పుడు ఈ భవనం ఖాళీ చేస్తే కూల్చివేసి కొత్తది కడతారా? లేక వదిలేస్తారన్నది ఇంకా స్పష్టత రాలేదు.


కాగజ్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రి

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 6: జైనూరు మండలం దేవుగూడ గ్రామానికి చెందిన ఆదివాసీమహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నంచేసిన నిందితుడు మక్దూమ్‌ను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూపరిషత్ తూర్పుజిల్లా అధ్యక్షుడు రేవెళ్లరాజలింగు శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. హిందూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు బాధ్యులైన వ్యక్తులను చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఆడపిల్లలకు తగుభద్రత కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు రమేష్, సంతోష్, సతీష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జైనూరులో కొనసాగుతున్న ఆంక్షలు

- రెండో రోజు కట్టుదిట్టమైన భద్రత
- ఇరువర్గాల ఆందోళనతో రూ.కోట్లలో నష్టం
- ఆస్తినష్టంపై అంచనాలు వేస్తున్న అధికారులు
- ఆసిఫాబాద్ డీఎస్పీపై బదిలీవేటు

జైనూరు/ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 6: జైనూరు మండలంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పోలీసులు విధించిన ఆంక్షలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర అదనపు డీజీ మహేష్‌భగవత్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలు జిల్లాల ఎస్పీలు అశోక్‌కుమార్, అఖిల్‌మహాజన్, గౌస్ ఆలం, బాలా నగర్ డీసీపీ సురేష్‌కుమార్ జైనూరులోనే మకాం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇరువర్గాల ఘర్షణలో సంభవించిన ఆస్తినష్టంపై అధికారులు నివేదికలను రుపొందించే పనిలోపడ్డారు. ఏమేరకు ఆస్తినష్టం సంభవించింది, ఎన్ని ఇండ్లు, దుకాణాలు దగ్ధం అయ్యాయి అని అంచనాలను రూపొందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకాధికారిగా డీఎస్పీ కరుణాకర్‌ను నియమించారు.

కొనసాగుతున్న 144 సెక్షన్..

జైనూరులో 144సెక్షన్ కొనసాగుతోంది. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు పోలీసు ఉన్నతాధికారులతో పాటు వెయ్యి మందికి పైగా స్పెషల్ పార్టీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ టీంలు బందోబస్తులో నిమగ్నమయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి జైనూరు వైపు ఎవరినీ రాకుండా అడ్డుకుంటున్నారు. జైనూరు నుంచి ఆసిఫాబాద్ వైపు, జైనూరు నుంచి ఉట్నూర్ వైపు, జైనూరు నుంచి లింగాపూర్ వైపు పికెటింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి కొత్త వ్యక్తులను ఎవరినీ అనుమతించడంలేదు. కేవలం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లే వారిని మాత్రమే అనుమతిస్తున్నారు.

ఆసిఫాబాద్ డీఎస్పీపై బదిలీ వేటు:

జైనూరులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘటనలో ఆసిఫా బాద్ డీఎస్పీ సదయ్యపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. ఈ మేరకు మల్టీజోన్-1ఐజీ పి చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో కాగజ్‌నగర్ డీఎస్పీగా పనిచేస్తున్న కరుణాకర్‌ను ఆసిఫాబాద్ డీఎస్పీగా నియమించారు.

ఏజెన్సీ మండలాల్లో కొనసాగుతున్న బంద్..

జైనూరులో జరిగిన ఘటనతో జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో రెండురోజులుగా బంద్ కొనసాగుతోంది. సిర్పూర్ (యు), లింగాపూర్, తిర్యాణి, కెరమెరి, వాంకిడి మండలాల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. రెండు రోజులుగా బంద్‌తో ప్రజలు నిత్యావసర సరుకులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఆసిఫాబాద్ డిపో నుంచి ఆదిలాబాద్‌వైపు ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో ఉట్నూర్, ఆదిలాబాద్ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు మంచిర్యాల మీదుగా ఉట్నూర్, ఆదిలాబాద్‌కు ప్రయాణిస్తున్నారు.

నిలిచిన ఇంటర్నెట్‌తో ఇక్కట్లు..

ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీసేవా కేంద్రాలు, ఏటీఎంలు, ఇతర ఇంటర్నెట్ ఆధారితసేవల్లో నడవడం లేదు. ఆన్‌లైన్ పేమెంట్‌లకు సైతం బ్రేక్ పడింది.





ఎస్పీఎం నుంచి వెలువడుతున్న పొగ

కాలుష్య కోరల్లో కాగజ్‌నగర్

- ఎస్పీఎం వ్యర్థాలతో కలుషితమవుతున్న పెద్దవాగు జలాలు
- నాలుగు మండలాల ప్రజలపై ప్రభావం
- పల్ప్‌శుద్ధి కోసం అధిక మోతాదులో రసాయనాల వాడకం
- వ్యర్థ జలాలలతోనే పలు చోట్ల పంటలు పండిస్తున్న రైతులు
- వ్యాధుల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

జిల్లా కార్మిక వర్గానికి వరప్రదాయినిగా చెబుతున్న సిర్పూరు పేపరు మిల్లు(ఎస్పీఎం) ఈ ప్రాంతం ప్రజానీకానికి పరోక్షంగా అనారోగ్యాన్ని ప్రసాదిస్తోంది. ఎస్పీఎం నుంచి వెలువడే విష వాయువులు, విషరసాయన జలాలతో ఇక్కడి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. కాగితం తయారీలో యాజమాన్యం చూపుతున్న శ్రద్ధ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాలపై పెట్టకపోవడంతో కాగజ్‌నగర్ పట్టణంతోపాటు పరిసరమండలాలు కాలుష్యకోరల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. - ఆసిఫాబాద్

జిల్లాలోని కాగజ్‌నగర్‌లో నిజాంకాలంలో ఏర్పాటు చేసిన సిర్పూరు కాగితపు పరిశ్రమ అనేక ఒడిదుడుగులను ఎదుర్కొంటూ ఇప్పటికే ముగ్గురు చేతులు మారింది. ఈ పరిశ్రమపై ప్రత్యక్షంగా 600మందిపైగా పరోక్షంగా పదివేల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. బిర్లా కుటుంబం చేతిలో నష్టాలపాలై సెప్టెంబరు 27, 2014లో మూసివేసిన తర్వాత కార్మికుల ఆందోళనతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జేకేసంస్థ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి ప్రత్యేక రాయితీలు ప్రకటించి ఆగస్టు 2, 2018లో పునరుద్ధరించింది. ఈ క్రమంలో పాతయంత్రాల స్థానంలో కొన్ని యంత్రాలను మార్చినప్పటికీ పూర్తిస్థాయిలో ఇంకా ఆధునీకరించలేదు.

కాగా కాగితపుతయారీలో కీలకమైన గుజ్జుశుద్ధిచేసే క్రమంలో అధిక మోతాదులో రసాయనాలను వినియోగించాల్సి ఉంటుంది. ఇందులో చాలా మటుకు హానికరమైనవేనని చెబుతున్నారు. కాగా పల్ప్(కర్రను ద్రవపదార్థంగా మార్చే ప్రక్రియ) శుద్ధి చేసిన తర్వాత వదులుతున్న వ్యర్థజలాల్లో కూడా ఇంకా రసాయనిక ఆవశేషాలు మిగిలిఉండటం వల్ల ఆ నీరు ప్రదేశం అంతా కాలుష్యంగా మారుతోంది. రసాయనాలతో ప్రవహించే నీటిని కాగజ్‌నగర్ పరిసరాల్లో చాలామంది రైతులు వరిసాగుకు వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రసాయనిక వ్యర్థాలతో కూడిన నీటిని వాడి పంటలు పండించటం వల్ల ఆ ఉత్పత్తులను వినియోగించిన వారికి పలు రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

గాలి,నీరు విషతుల్యం..



ఎస్పీఎం వ్యర్థ జలాలతో పండిస్తున్న పంటలు

ఎస్పీఎం ద్వారా విడుదలవుతున్న వ్యర్థాల కారణంగా గాలి, నీరు విషతుల్యమవుతున్నాయి. ఫ్యాక్టరీ నుంచి వెదజల్లే పొగతో పట్టణమంతా దుర్వాసన వస్తోంది. పట్టణంతోపాటు సమీప మండలాల్లో గాలి ద్వారా విషవాయువులు వ్యాప్తిచెందడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వర్షం కురిసినప్పుడల్లా పొగగొట్టాల ద్వారా వెళ్లాల్సిన పొగ గాలిలో ఉన్న తేమ వల్ల కిందకు వచ్చి పట్టణమంతా వ్యాప్తిచెందుతోంది. దీంతో శ్వాస తీసుకునేందుకు కూడా ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పట్టణమంతా పొగతో కమ్మేస్తుండడంతో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే పెద్దవాగులో జలాలు కలుషితం అవుతుండడంతో పాటు ఈ వ్యర్థం ప్రవహించే పరివాహకం ప్రాంతంలోని కాల నీల్లో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో ప్రజలు ఈ వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యానికి పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పల్ప్ శుద్ధి తర్వాత విడుదల చేసే వ్యర్థ జలాలతో ఎలాంటి హానీ కారక రసాయాలు లేవని ఫ్యాక్టరీ ప్రతినిధులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ నీరు ప్రవహించిన పంట భూములన్నీ తెల్లబారిపోయి దిగుబడులు కూడా తగ్గుతున్నట్టు రైతులు చెబుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి విడులయ్యే ఈ వ్యర్థ జలాలు మసాలవాగులో కలిసి అక్కడి నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న పెద్దవాగులోకి కలుస్తుండడంతో పెద్దవాగు పరివాహక ప్రాంతంలో ఉన్న కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట, బెజ్జూరు మండలాల్లోని చాలా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రభావితం అవుతున్నట్టు చెబుతున్నారు. కొంతకాలంగా ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే జలాలతో పెద్దవాగు నీరు కూడా దుర్వాసన వస్తోందని రైతులు చెబుతున్నారు.

ఈ వాగు పరివాహక ప్రాంతంలోనే అరుదైన జంతువులు, పక్షులు మనుగడ సాగిస్తున్నాయి. ఫ్యాక్టరీవ్యర్థాలు పెద్దవాగులో కలువడం వల్ల వాగు పరివాహక ప్రాంతంలోని వణ్యప్రాణులు, పక్షులు, అరుదైన జలచరాలపై ప్రభావం పడుతోంది. ఈ భరించరాని వాసనతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కాగితం తయారీలో వాడే రసాయనాల వల్ల రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం, గుండె, ఊపిరితిత్తుల, కంటి సంబంధిత వ్యాధులు, శ్వాసనాళ సంబంధిత వ్యాధులు, దగ్గు, దమ్ము వంటి అనారోగ్యకరమైన దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయి.



కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం ప్రధాన గేటు

దుర్గంధంతో ఇబ్బందులు..



అంబాల ఓదెలు, కాగజ్‌నగర్

ఎస్పీఎం నుంచి వెలువడే దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో దీని తీవ్రత అధికంగా ఉంటోంది. మిల్లు పరిసరప్రాంతాల కాలనీ వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పట్టణమంతా పొగతో కమ్మేస్తోంది. ఫ్యాక్టరీ వ్యర్థాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కాగజ్‌నగర్‌తోపాటు సమీప మండలాల ప్రజలపై ప్రభావం పడుతోంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం



రైతులతో మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

సిర్పూర్(టి), సెప్టెంబరు 6: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలంగాణ ఫైనాన్స్‌కమిషన్ చైర్మన్ సిరిసిల్లరాజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని టోంకిని, పారిగాం, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఇటీవలకురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిఏటా వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితులే తలెత్తుతున్నాయని ముంపునకుగురై ఏటా పంటలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయనవెంట ఏవో మధులత, ఎంపీడీవో సత్యనారాయణ, ఎమ్మార్వో శ్రీనివాస్ తదితరులున్నారు.

ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు ఘనస్వాగతం



కాగజ్‌నగర్‌లో సిరిసిల్ల రాజయ్యకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కాగజ్‌నగర్: రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య శుక్రవారం కాగజ్‌నగర్‌కు రావటంతో స్థానికనాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఎస్పీఎం గెస్ట్‌హౌజ్‌లో కాంగ్రెస్ నాయకులు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీఇన్‌చార్జీ చైర్మన్లు కోనేరు కృష్ణారావు, సిడాం గణపతి, బసార్కర్ విశ్వనాథ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం మాజీఎమ్మెల్యే కోనప్ప నిర్వహిస్తున్న నిత్యాన్నాదానసత్రాన్ని పరిశీలించి భోజన వసతులు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్



సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీవోకార్యాలయ సిబ్బంది



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, సెప్టెంబరు 6: కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్‌గా శ్రద్ధా శుక్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ రెవెన్యూ డివిజన్‌అధికారిగా సురేష్ పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీవో కార్యాలయాల్లో సబ్‌కలెక్టర్లకు పోస్టింగులిస్తూ ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికిచెందిన 2022ఐఏఎస్ బ్యాచ్‌కుచెందిన శ్రద్ధా శుక్లాకు తొలిపోస్టింగ్ కాగజ్‌నగర్ కేటాయించారు.

కలెక్టర్‌ను కలిసిన సబ్‌కలెక్టర్

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేను ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అంశాలపై వారు చర్చించారు.



రిటైర్డ్ ఉద్యోగులకు నూతన వేజ్‌బోర్డు పెన్షన్ అమలు చేయాలి

మందమర్రి టౌన్, సెప్టెంబరు 6: సింగరేణిలో రిటైర్డ్ ఉద్యోగులకు నూతనవేజ్‌బోర్డు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రిటైర్డు కార్మిక నాయకులు వాసాల శంకర్, రేణికుంట్ల కొమురయ్య, బొలిశెట్టి రాజయ్య,రమణ పేర్కొన్నారు.శుక్రవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారుమాట్లాడుతూ ఉద్యోగవిరమణ పొంది సంవత్సరం గడిచిపోతున్నా ఇంకా చాలామందికి గ్రాట్యుటీ రాలేదన్నారు. అంతేకాకుండా పెన్షన్‌కు సంబంధించిన ఏరియర్స్‌కూడా చెల్లించాలని వారు కోరారు. రిటైర్డుకార్మికులంటే చులకనగా చూడడం సరికాదన్నారు. సింగరేణిలో చాలా ఏరియాల్లో క్వార్టర్లు ఖాళీగా ఉండి కూలిపోయే దశకు చేరకున్నాయని, వాటిని రిటైర్డుకార్మికులకు కేటాయించాలన్నారు. సెప్టెంబరులో రిటైర్డుకార్మికుల ప్రధాన డిమాండ్లయిన నూతనపెన్షన్, ఏరియర్స్, గ్రాట్యుటీని చెల్లించకపోతే జీఎం కార్యాలయం ఎదుట దీక్షలు చేస్తామని వారు తెలిపారు. ఇప్పటికైనా తమసమస్యలపై కార్మికసంఘాలు స్పందించాలని వారుకోరారు. కార్యక్రమంలో దాసరిఎల్లారం,బిరాజన్న,బి అశోక్, స్వామి, గట్టయ్య, వడ్లకొండ వీరయ్య పాల్గొన్నారు.

తీవ్రవాదులను ఎదుర్కోవడానికి మాక్‌డ్రిల్



తీవ్రవాదిపై గన్ను ఎక్కుపెట్టిన జవాన్

జైపూర్, సెప్టెంబరు 6: ఎస్టీపీపీలో చొరబడే తీవ్రవాదులను అడ్డుకోవడం కోసం మాక్‌డ్రిల్ ఎంతో దోహదపడుతుందని సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేష్‌పర్మార్ పేర్కొన్నారు. శుక్రవారం సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మల్టీఏజెన్సీ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని పరిపాలనభవనంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్టీపీపీలో మాక్‌డ్రిల్ నిర్వహించామన్నారు. ఏదైనా అనుకోని సంఘటనలు, టెర్రరిస్టులు ప్లాంట్‌లోకి చొరబడినప్పుడు ప్లాంటు, అందులో పనిచేసే అధికారులు, ఉద్యోగులను ఎలా కాపాడుతామో ఈ మాక్‌డ్రిల్ ద్వారా చూపించామన్నారు. సింగరేణి ఎక్కువ మావోయిస్టు ప్రభావితప్రాంతాల్లో ఉన్నందున ఇటువంటి మాక్‌డ్రిల్ జరపడం ద్వారా అధికారులు, ఉద్యోగులకు అవగాహన వస్తుందన్నారు. ఈ మాక్‌డ్రిల్‌లో సీఐఎస్ఎఫ్, స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, అధికారులు జేఎన్ సింగ్, ప్రసాద్, సుధాకర్, మదన్‌మోహన్, ప్రభాకర్, మోహన్‌సింగ్, ఏఐటీయూసీ పిట్‌సెక్రెటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వోటు జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6: శ్రీరాంపూర్ ఏరియాకు నూతనంగా వచ్చిన ఎస్‌వోటు జీఎం సత్యనారాయణను సింగరేణి ఎస్సీ,ఎస్టీ సంక్షేమసంఘం (1630/1982) ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి కంబాల నాగయ్య, సదరం రాజేంద్రప్రసాద్, ఎస్సీ లైజన్ అధికారి కిరణ్‌కుమార్, నాయకులు మారేపల్లి బాబు, రజిత, రవికుమార్, మహేందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6: కాంట్రాక్టు కార్మికుల వేతనాలుపెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికసంఘం(సీఐటీయా) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ డిమాండ్ చేశారు. వేతనాలపెంపు కోరుతూ చేపట్టనున్న పోరుబాటలో భాగంగా శుక్రవారం శ్రీరాంపూర్ ఓసీపీలో కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2022సమ్మె సందర్భంగాకుదిరిన ఒప్పందాన్ని అమలు చేయడంలేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనజీవోలను గెజిట్ చేయకపోవడం వల్లనే అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. వేతనపెంపుపై అక్టోబర్4న నిర్వహించే చలోహైదరాబాద్ కార్యక్రమాన్నికాంట్రాక్టు కార్మికులు విజయవంతంచేయాలని కోరారు. కార్యక్రమంలో బెల్ట్, రోడ్డు క్లీనింగ్ కార్మికులు, కన్వేయన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6:క్రీడల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శించాలని డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు అన్నారు. వార్షికక్రీడల్లో భాగంగా ప్రగతిమైదానంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి కోల్‌ఇండియాస్థాయిలో గెలుపొందడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సింగరేణి తమఉద్యోగులను ఆటల్లో ప్రోత్సహిస్తుందని తెలిపారు. తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే క్రీడల్లోపాల్గొనడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, క్రీడలగౌరవకార్యదర్శి కె స్వజన్ పాల్,స్పోర్ట్స్‌సూపర్‌వైజర్ అశోక్,కోఆర్డినేటర్ నర్సయ్య, జనరల్‌కెప్టెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదోన్నతుల్లో ఆర్వోఆర్ అమలు చేయాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6: సర్వేస్‌జనరల్ మజ్దూర్ పదోన్నతుల్లో రూల్‌ఆఫ్‌రిజర్వేషన్ (ఆర్‌వోఆర్) అమలు చేయాలని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు డేగలప్రవీణ్ కోరారు. శుక్రవారం ఆయన ఇన్‌చార్జి జీఎంటి శ్రీనివాస్‌ను కలిసివినతిపత్రం అందించారు. పదోన్నతుల్లో రిజర్వేషన్ అమలు కావడం లేదని తమదృష్టికి వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్‌కార్యదర్శి నక్కసుమన్, జాయింట్‌కార్యదర్శి దేవిశ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6: విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని సింగరేణికోల్‌మైన్స్ కార్మికసంఘ్(బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధానకార్యదర్శి యతిపతి సారంగపాణి అన్నారు. ఆర్కే-5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌కు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించకపోవడంతో సింగరేణి తీవ్రంగా నష్టపోతోందని ఆవేదనవ్యక్తం చేశారు. అనంతరం టీబీజీకేఎస్‌లో ఎస్అండ్‌పీసీ సహాయకార్యదర్శిగా పనిచేసిన కొమ్ముబాపు బీఎంఎస్‌లో చేరగా, ఆయనకు కండువాకప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, కార్యదర్శి రాగం రాజేందర్, ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడిశ్రీధర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోండి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 6: రిటైర్డ్ ఉద్యోగులు హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవాలని ఎస్ఆర్పీ3, 3ఏ గని మేనేజర్ వెంకట్‌రావు కోరారు. గనిపై శుక్రవారం వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించి, హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ఉద్యోగవిరమణ పొందిన, మరణించిన, అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు సంబంధించిన సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ, వితంతు పెన్షన్, సెటిలింగ్ అలవెన్స్, సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డు, గ్రూపు ఇన్సురెన్స్ స్కీం, కారుణ్య నియామకాలకు సంబం ధించిన అన్ని వివరాలు హెల్ప్‌డెస్క్ ద్వారా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి ఎస్ఎండీ గౌస్ పాషా, పిట్‌కార్యదర్శి మురళీచౌదరి, అధికారులు ప్రేమ్ కుమార్, అరుణ్ కుమార్, శ్రీనివాస్, వర్క్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.